డిప్యూటీ సిఎంను కలిసిన డిఎస్‌పి

ప్రజాశక్తి - సాలూరు

డిప్యూటీ సిఎం పి.రాజన్నదొరను ఆయన నివాసంలో ఆదివారం పాలకొండ డిఎస్‌పి కృష్ణారావు కలుసు కున్నారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. సబ్ డివిజన్ పరిధిలోని బత్తిలి నూతన పోలీసు స్టేషన్ భవన ప్రారంభోత్సవానికి ఆహ్వానం పలికారు. ఈ మేరకు ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆయన వెంట రూరల్ సిఐ ధనుంజయ రావు వున్నారు.

రాజన్నదొరకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న డిఎస్‌పి

ధాన్యం అన్‌లోడ్ చేసుకుంటున్న రైతులు

అన్నదాతపైనే భారమంతా

- ధాన్యం కొనుగోలులో రైతులకు తప్పని కష్టాలు
- కానరాని కస్టోడియన్ ఆఫీసర్లు
- సొల్యూషన్ ఫ్రీగా మారిన టోల్ ఫ్రీ నెంబర్లు
- ప్రకటనలకే పరిమితమైన ఉన్నతాధికారులు
- అడుగడుగునా పర్యవేక్షణ లోపం

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాదీ ధాన్యం కొనుగోలు ప్రక్రియ రైతును మరింత నిరాశకు గురిచేస్తుంది. ఇప్పటికే జిల్లాకు తుపాన్ ముప్పు పొంచి ఉండడంతో రైతులు తమ వద్ద ఉన్న ధాన్యాన్ని అమ్ముకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. రవాణా ఛార్జీల నుంచి మిల్లులో ధాన్యం దింపేందుకు అవసరమైన హమాలీ ఛార్జీల వరకు మొత్తం భారం రైతు పైనే పడుతోంది. ఇప్పటికే జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైనా, కొత్తగా ప్రభుత్వం నియమించిన ధాన్యం సిబ్బందికి సరైన అవగాహన లేకపోవడంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియ అయోమయంగా మారింది. కొన్నిచోట్ల సిబ్బందికి కొనుగోలు ప్రక్రియ విధి విధానాలు తెలియకపోవడంతో అది ఏ విధంగా చేయాలో తెలీక మరింత జాప్యం జరుగుతోంది. రైతులు తాము స్వయంగా రవాణా వాహనాన్ని ఏర్పాటు చేసుకున్నప్పటికీ మిల్లు దగ్గర అన్లోడింగ్ చేయడానికి రోజుల తరబడి వేచి నిరీక్షించాల్సి వస్తోంది. దీంతో ఇప్పటికే చాలామంది వాహనదారులు ధాన్యం రవాణాకు వెనకడుగు వేస్తున్నారు. కొంతమంది మిల్లర్లు క్వింటాకు ఐదు కేజీలు ధాన్యాన్ని అదనంగా డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా ధాన్యం దింపేందుకు బస్తాకు ఐదు రూపాయలు చొప్పున వసూలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. మిల్లులో హమాలీల్లేక రైతు తన ధాన్యాన్ని తానే దింపుకొని 40 కేజీలు బస్తాకు ఐదు రూపాయలు చొప్పున చెల్లించుకోవాల్సిన దుస్థితి నేడు జిల్లాలో ఏర్పడింది. తమ సమస్యలను కొనుగోలు సిబ్బందికి తెలియజేసినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోతుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కు సంబంధించి మిల్లుల వద్ద ఏర్పాటు చేసిన కస్టోడియన్ అధికారులు ఎవరూ అందుబాటులో లేరని, కొంతమేర పరిజ్ఞానం ఉన్న రైతులు టోల్ ఫ్రీ నెంబర్లను సంప్రదించినా ఎటువంటి పరిష్కారం దొరకడంలేదని, పై స్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే ఇన్ని అడ్డంకులు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతాంగం వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించి జరుగుతున్న అవకతవకలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం అన్‌లోడ్ కాకపోవడంతో మిల్లుల వద్ద నిలిచిపోయిన లారీలు

జిల్లా సదస్సు వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

జిల్లా సమగ్రాభివృద్ధికై కదలిరండి : సిపిఎం

15న పార్వతీపురంలో సదస్సు

ప్రజాశక్తి -పార్వతీపురం

జిల్లా సమగ్రాభివృద్ధికి చేయి చేయి కలుపుదాం... జిల్లా ప్రజలంతా కదలిరండి, కలిసి రండని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో జిల్లా సమగ్రాభివృద్ధికై ఈనెల15న ఉదయం 10 గంటలకు బెలగాం చర్చి సెంటర్లోని కమ్యూనిటీ హాల్లో నిర్వహించే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపున ఎత్తైన కొండలు, దట్టమైన అటవీ ప్రాంత, ఓవైపు అక్షర జ్ఞానం లేని గ్రామాలు, మరోవైపు అభ్యుదయ భావాలతో దోపిడీని ఎదిరించే గ్రామాలు కూడా ఈ జిల్లా ప్రత్యేకతలని, జంఝావతి, తోటపల్లి వంటి జలాశయాలతో పాటు నాగావళి, సువర్ణముఖి వంటి జీవ నదులు జిల్లా సొంతం కాగా, కళలు, సాహిత్యం తదితర రంగాలకు పార్వతీపురం పెట్టింది పేరుగా, అపారమైన వనరులున్న జిల్లా ఏళ్ల తరబడి పాలకుల నిర్లక్ష్యానికి గురై వెనుకబడిన ప్రాంతంగా మిగిలి ఉందని అన్నారు. కొత్తగా మన్యం జిల్లాగా ఏర్పడిన నేపథ్యంలో జిల్లా అభివృద్ధికి ప్రత్యేక కృషి అవసరం, పాలకులు ఎవరైనా గిరిజనులు, దళితులు, బిసిల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ పెట్టలేనందున వెనుకబడే ఉన్నారన్నారు. జంఝావతి ప్రాజెక్టు వెంటనే పూర్తి చేయాలని, గిరిజన ప్రాంతంలో చిన్న చిన్న గెడ్డలు, వాగులు, నదులపై మినీ రిజర్వాయర్లు నిర్మించాలని, లచ్చయ్యపేట సుగర్ ఫ్యాక్టరీ, సాలూరు జ్యూట్ ఫ్యాక్టరీలను తెరిపించాలని, గిరిజన ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపించాలని కోరారు. అలాగే పార్వతీపురంలో యూనివర్సిటీ, మెడికల్ కాలేజీనిర్మించాలని, గిరిజన గ్రామాల్లో రోడ్లు, వంతెనలు మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని, పూర్ణపాడు లాబేసు వంతెన పూర్తి చేయాలని కోరారు. జిల్లా అభివృద్ధి కోసం చర్చించి సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, రాజకీయాలకు అతీతంగా పోరాడి జిల్లాను అభివృద్ధి చేసుకుందామని, అందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు మండంగి రమణ, సర్పంచ్ కె.రామస్వామి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, యమ్మల మన్మధరావు, కోలక అవినాష్, జిల్లా కమిటీ సభ్యులు ఎన్‌వై. నాయుడు, జి.వెంకటరమణ, కోరాడ ఈశ్వరరావు, మర్రి శ్రీనివాస రావు, మండంగి శ్రీను, రెడ్డి లక్ష్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వైకల్యం అడ్డుకోలేదు

ప్రతిభావంతులకు అన్ని విధాలా ప్రోత్సాహం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రతిభ గల వారికి వైకల్యం ఏమాత్రం అడ్డు కాదని, ప్రతిభావంతులైన వారిని గుర్తించి అన్ని విధాలా ప్రోత్సహించడంలో తమ ప్రభుత్వం ముందుంటుందని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఆదివారం స్థానిక గిరి మిత్ర సమావేశ భవనంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో సుమారుగా 15వేల మంది వివిధ వైకల్యాలతో బాధపడుతున్న 21 రకాల వారిని విభిన్న ప్రతిభావంతులుగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది అని తెలిపారు. వారంతా సమాజంలో నిలదొక్కుకునేలా ప్రభుత్వం అండగా నిలుస్తోందని, వీరంతా స్వయం ప్రతిపత్తి, సాధికారత సాధించేలా ప్రతిభావంతులుగా నిలబెట్టేందుకు కృషి చేస్తోంది అన్నారు. ప్రత్యేకంగా విద్య, ఉద్యోగం, ఉపాధి కల్పించేందుకు అనేక చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. వారి సమస్యలు గుర్తించి పరిష్కరించే దిశ కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీలను సైతం ఏర్పాటు చేయడం కూడా జరిగింది అని తెలిపారు. సదరం ద్వారా వైకల్యం ధ్రువీకరణ పత్రాలు అందించడాన్ని సైతం సులభతరం చేసింది. ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థల్లో వారికి 5 శాతం రిజర్వేషన్ కల్పించింది.

వికలాంగ విద్యార్థినికి లేప్‌టాప్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ప్రభుత్వ విద్యా సంస్థల్లో ప్రవేశానికి సైతం గరిష్టంగా ఐదేళ్ల వయోపరిమితిని సడలించింది. దీంతోపాటు విద్యాలయాలు, ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలకు విభిన్న ప్రతిభావంతులు వెళ్లి వచ్చేందుకు ఎటువంటి అవాంతరాలు (అడ్డంకులు) లేకుండా నిర్మాణాలు చేపడుతున్నాము అని ఎమ్మెల్యే తెలిపారు.

పెద్ద మనసుతో ఎన్నో చర్యలు

రాష్ట్రంలో విభిన్న ప్రతిభావంతులకు విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది 1,750 మూడు చక్రాల మోటార్ సైకిళ్లు, అనేక సహాయక పరికరాలు అందించామని ఎమ్మెల్యే తెలిపారు. అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో వారికి సీట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవడంతో పాటు, బడికి వెళ్లేలా సౌకర్యాలు కల్పించాం. చెవిటి, మూగ వారికి, అంధ విద్యార్థులకు 640 మందికి ప్రత్యేకంగా ఆరు ప్రత్యేక విద్యాసంస్థల్ని నిర్వహిస్తున్నామని అన్నారు. జగనన్న వసతి దీవెన, స్కాలర్‌షిప్‌లు అంది స్తున్నాం. ప్రత్యేక భర్తీతో 691 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావం తులను ప్రత్యేకంగా సన్మానించి వారికి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, విభిన్న ప్రతిభావంతుల శాఖకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

కలవర పెడుతున్న 'మిచౌంగ్'

పంటను కాపాడుకొనేందుకు రైతుల పాట్లు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని ఆరుగాలం కష్టించి పండించిన పంట ఇంటికి చేర్చుకొనే లోపల తుపాను రైతులను వెంటాడడంతో ఆందోళనకు గురవుతున్నారు. అక్కడక్కడ చిరుజల్లులు కురుస్తుండడంతో కళ్లాల్లో ఉన్న తమ ఫలసాయాన్ని రక్షించుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

జిల్లాలో ఈఏడాది 1.66లక్షల ఎకరాల్లో వరిసాగు చేయగా, అందులో 30 నుంచి 35శాతం వరకు కోతలు జరిగాయని అధికారులు చెబుతున్నారు. ఇందులో నూర్పిళ్లు జరిగి, ధాన్యం బస్తాల రూపంలో కళ్లాల్లోనే ఉండగా, మరికొంత కోసిన చేను రూపంలో పొలాల్లోనే ఉంది. దీంతో తమ పంటను రక్షించుకునేందుకు కోసిన పంటను కుప్పలు వేసే పనిలో రైతులు ఉన్నారు. అరకొరగా తమ దగ్గర ఉన్న టార్పాలిన్లతో పంటను రక్షించుకొనేందుకు తంటాలుపడుతున్నారు. పరిస్థితిని సమీక్షించేందుకు వ్యవసాయ అధికారులు మండలాల్లో పర్యటించి, రైతులకు తగు సూచనలు ఇస్తున్నారు. పంట తడిసిపోకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని, ఇంకా కోతలు జరగని భూముల్లో కోతలు చేపట్టొద్దంటూ సూచనలు చేస్తున్నారు.

పండక అలా... పండితే ఇలా

సీజన్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు జోరుగా విత్తనాలు జల్లుకుని నాట్లువేసుకున్న రైతులు పంట చేతికందే సమయంలో తీవ్ర వర్షాభావం పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాల్లేక సుమారు 3500 ఎకరాల్లో పంట ఎండిపోయినట్లు అధికారికంగా వ్యవసాయ శాఖ ప్రకటించినప్పటికీ ఇంకా ఎక్కువే పంటనష్టం జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. నానా కష్టాలు పడి, వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొని అందుబాటులో ఉన్న నీటి వనరులను అధిక వ్యయం భరించి పంటను దక్కించుకుని, కోతలు పూర్తిచేసుకుని ఇంటికి తీసుకువెళ్లే పరిస్థితిలో ఆకస్మికంగా తుపాన్ ఏర్పడడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ముంపు ప్రాంతాలను పరిశీలించిన పోలీసులు

తుపాను వల్ల అటు రైతులకు ఇటు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పై అధికారుల ఆదేశాల మేరకు రూరల్ ఎస్సై దినకర్ తన బృందంతో పార్వతీపురం రూరల్ పరిధిలో వర్షం వస్తున్న ప్రతిసారీ పొంగిపొర్లుతున్న పుట్టూరు -లచ్చిరాజుపేట గ్రామాల మధ్య ఉన్న సాకిగెడ్డ అలాగే తాళ్లబురిడి- ములగ గ్రామాల మధ్య ఉన్న సాకి గెడ్డ కల్వర్టు, లచ్చిరాజుపేట నుండి పులుగుమ్మి గ్రామం గెడ్డ వద్ద ఉన్న కల్వర్టులను ఆదివారం పరిశీలించారు. పుట్టూరు, లచ్చిరాజుపేట గ్రామాల ప్రజలకు, రైతులకు జాగ్రత్తలు చెప్పి తుపాను వల్ల ఎటువంటి అవసరమైనా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్లకు కాల్ చేయాలని, స్థానిక పోలీస్ సిబ్బందికి తప్పకుండా తెలియజేయాలని అన్నారు. వీరి వెంట పుట్టూరు వీఆర్వో చంటిబాబు పాల్గొన్నారు.

పార్వతీపురం : కల్వర్టును పరిశీలిస్తున్న ఎస్ఐ

గరుగుబిల్లిలో వరి పంటను ఒడ్డుకు తీసుకెళ్లే పనిలో రైతులు

గరుగుబిల్లి : తుపాను ముప్పు ఉండడంతో మండలంలో పలు గ్రామాల రైతులు కోసిన వరి పంటను కుప్పలు వేయడంలో నిమగ్నమయ్యారు. ఇదిలా ఉంటే నూర్చిన పంట అమ్మదాం అంటే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో దళాలరులను ఆశ్రయిస్తే వారికి క్వింటాకు నాలుగు కేజీలు ఎక్కువ ఇవ్వాల్సి వస్తోంది. గత్యంతరం లేక దళారులకే తక్కువ ధరకు అప్పజెప్పాల్సి వస్తుందని రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

తుపాను కంట్రోల్ రూం ఏర్పాటు

సీతంపేట: మిచాంగ్ తుపాన్ నేపథ్యంలో స్థానిక ఐటిడిఎలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. తుపాన్‌కు సంబంధించిన సమాచారం కోసం ప్రజలు కంట్రోల్ రూంకు ఫోన్ చేయవచ్చని తెలిపారు. కంట్రోల్ రూం ఫోన్ నెంబర్: 08941 294040.

ఓటరు నమోదును బిఎల్‌ఒను అడిగి తెలుసుకుంటున్న పిఒ

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని వనాపురంలో 57వ నెంబరు పోలింగ్ స్టేషన్, పెదరామలోని 53 పోలింగ్ స్టేషన్‌ను ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి ఆదివారం పరిశీలించారు. స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా పోలింగ్ స్టేషన్లను ఆమె పరిశీలించారు. బిఎల్‌ఒలు రిజిస్టర్లను పరిశీలించారు. ఒకే ఇంట్లో 10 మంది కన్నా ఎక్కువ ఉన్న ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. చనిపోయిన వారి ఓట్లను విచారణ చేపట్టి తొలగించాలన్నారు. కొత్తగా ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. బిఎల్‌ఒ రిజిస్టర్‌ను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో బిఎల్‌ఒలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ఆటో యూనియన్ మద్దతు

ప్రజాశక్తి - పాలకొండ

అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 8 నుంచి చేపట్టిన సమ్మెకు ఆటో డ్రైవర్ల యూనియన్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రాము మాట్లాడుతూ అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, మినీ అంగన్వాడీ కేంద్రాలు మెయిన్ సెంట్రల్‌గా అమలు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి పాదయాత్ర సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం కంటే మన ప్రభుత్వం వచ్చాక అదనంగా వేతనం ఇస్తామని చెప్పి నాలుగున్నరేళ్లయినా ఇప్పటికీ ఆ హామీని నీటిమూటలగానే మిగిలిపోయాయని అన్నారు. ప్రభుత్వ పథకాలు అంగన్వాడీ వర్కర్లకు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతరం అంగనవాడీలకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ కరపత్రాలను ఆటో కార్మికులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో దూసి పాపారావు, డి. వీరయ్య, కె.సూర్యారావు, వి.రవి, శ్రీను, కె.అప్పన్న, కెసూరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోట టు సాలూరు

- ఓటు బదిలీ చేయించుకున్న స్వాతీరాణి
- అరకు ఎమ్‌పి సీటుపై గురి
- అదే రూటులో డిప్యూటీ సిఎం
- వైసిపి అధిష్టానం నిర్ణయంపై ఆశలు

ప్రజాశక్తి - సాలూరు

జిసిసి మాజీ చైర్ పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి పార్వతీపురం మన్యం జిల్లాలో ఓటు హక్కు నమోదు చేయించుకున్నారు. ఇంతవరకు ఆమె ఓటు హక్కు ఎస్.కోట నియోజకవర్గంలో ఉండేది. ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులకు గడువు ముగియనున్న నేపథ్యంలో స్వాతిరాణి, ఆమె భర్త గుల్లిపిల్లి గణేష్ ఓట్లను సాలూరు పట్టణానికి బదిలీ చేయించుకున్నారు. పట్టణంలోని శివాలయం వీధిలో ఆమెకు సొంత ఇల్లు ఉంది. గుల్లిపిల్లి గణేష్ సొంత ఊరు సాలూరు కావడంతో ఓట్లను బదిలీ చేయించుకున్నారు. రానున్న ఎన్నికల్లో అరుకు ఎంపీగా పోటీ చేయాలనే యోచనలో డాక్టర్ స్వాతీరాణి వున్నట్లు తెలుస్తోంది. నిన్న మొన్నటిదాకా జిసిసి చైర్‌పర్సన్‌గా ఆమె కొనసాగారు. గతంలో ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌గా పని చేశారు. పార్టీ అగ్రనేతల ఆశీస్సులతో అరుకు ఎంపీ నియోజక వర్గం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్లు కనిపిస్తోంది. దీనిలో భాగంగానే ఆమె తన ఓటును అరుకు ఎంపీ నియోజకవర్గంలో ఉన్న సాలూరు పట్టణానికి బదిలీ చేయించుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవల పార్టీ నిర్వహించిన సామాజిక సాధికారత బస్సు యాత్రల్లో కూడా స్వాతీరాణి, ఆమె తల్లి శోభా హైమావతి చురుగ్గా పాల్గొన్నారు. స్వాతీరాణి భర్త గుల్లిపిల్లి గణేష్ పుట్టిన ఊరు సాలూరు కావడంతో ఆయనకు పట్టణంలోని చాలామంది నాయకులతో సత్సంబంధాలు వున్నాయి. సామాజిక కోణంలో కూడా బంధువర్గం ఇక్కడ వుంది. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌గా పనిచేసిన నేపథ్యంలో కూడా ప్రధాన రాజకీయ పార్టీల నాయకులతో విస్తృత పరిచయాలు వున్నాయి. అంతేకాకుండా అరుకు ఎంపీ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కీలకపాత్ర పోషిస్తున్న సామాజిక వర్గానికి చెందిన నాయకుడు గణేష్ కావడం కూడా వారికి అనుకూల అంశంగా చెప్పవచ్చు. అటు ఎస్టీ, ఇటు బిసి సామాజిక వర్గాల నాయకులతో సంబంధాలు కలిగి వుండడంతో ఆమె అరుకు ఎంపీ సీటు ఆశిస్తున్నారు.

అయితే ప్రస్తుతం డిప్యూటీ సిఎంగా రాజన్నదొర కూడా అరుకు ఎంపి సీటు కావాలని కోరుతున్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన రాజన్నదొర మంత్రి, డిప్యూటీ సీఎం వంటి కీలక పదవులు అలంకరించారు. గతంలో జిసిసి అధికారిగా అరుకు, పాడేరు, కురుపాం, పార్వతీపురం నియోజకవర్గాల్లో పని చేసిన రాజన్నదొరకు కూడా గిరిజన సంఘాలతో సత్సంబంధాలు వున్నాయి. సీనియర్ గిరిజన ఎమ్మెల్యేగా అరుకు ఎంపి నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల నాయకులతో సంబంధాలు వున్నాయి. దీంతో ఆయన కూడా ఎంపి సీటుపై ఆశలు పెట్టుకున్నారు. రాజన్నదొర, స్వాతీరాణి ఇద్దరూ అరుకు ఎంపి సీటు కావాలని కోరుతున్నారు. ఇద్దరిలో ఒకరికి ఎంపీ సీటు, మరొకరికి అసెంబ్లీ సీటు దక్కే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అయితే ఎవరిని ఎటు పంపించాలనే దాన్ని వైసిపి అధిష్ఠానం నిర్ణయిస్తుంది. పార్టీ అంతర్గత సర్వేలు, సామాజిక సమీకరణలను దృష్టి లో పెట్టుకొని అధిష్టానం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఏది దక్కినా ఫర్వాలేదని , హైకమాండ్ నిర్ణయమే శిరోధార్యమనే రీతిలో ఇద్దరు నేతలు వున్నారు. ఎన్నికల ముహూర్తం సమీపిస్తున్న తరుణంలో ఒకటి రెండు నెలల్లో ఎవరెటు దానిపై ఉత్కంఠకు తెరపడనుంది.

సాధికార బస్సుయాత్రలో కలిసి పయనిస్తున్న రాజన్నదొర, స్వాతీరాణి (ఫైల్)

24న ఆంగ్లభాషా సామర్థ్య పరీక్ష

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 24న ఆంగ్ల భాష పాఠ్యాంశాలపై రాష్ట్ర స్థాయి ప్రతిభా పాటవ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఆంగ్ల భాషోపాధ్యాయుల సంఘం అధ్యక్షులు (డెల్టా) ఎం.విజయమోహన రావు తెలిపారు. ఆదివారం డెల్టా సభ్యులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రైవేట్ మినహా అన్ని ప్రభుత్వ యాజమాన్యాల ఉన్నత పాటశాలల పదో తరగతి విద్యార్థులకు గత 12 ఏళ్లుగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా బొబ్బిలి లోని డెల్టా కార్యాలయంలో ఈ పరీక్ష నిర్వహిస్తామని అన్నారు. రాష్ట్ర స్థాయిలో మొదటి పది స్థానాలు సాధించిన వారికి ప్రశంసా పత్రాలు, బహుమతులు, స్టడీ మెటీరియల్ అందిస్తున్నట్లు అన్నారు. ఈ నెల 14లోగా ఆయా పాఠశాలల ఆంగ్ల భాషా ఉపాధ్యాయులు తమ విద్యార్థుల వివరాలను 9440744741 నంబరులో నమోదు చేసుకావాలని కోరారు. డెల్టా సభ్యులు యం. సన్యాసి రావు, కే. చిన్నారావు, బి.కిషోర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

ప్రజాశక్తి - పాలకొండ

మండల కేంద్రం ఆదివారం నేషనల్ మీమ్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో, ఉన్నత పాఠశాల ల్లోని మూడు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షల్లో 559మంది విద్యార్థులకు గానూ 544మంది పరీక్షకు హాజరయ్యారు. స్క్వాడ్ అధికారిగా డిప్యూటీ డిఇఒ పర్రి కృష్ణమూర్తి పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ప్రభుత్వ బాలికల పాఠశాలలో చీఫ్‌గా సూర్యనారాయణ, డిపార్టమెంటల్ ఆఫీసర్‌గా జె.రమేష్ వ్యవహరించారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి
www.prajasakti.com

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర కార్యదర్శి డంబురు

జీతాలు పెంచాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలో పనిచేస్తున్న ఆదివాసీ మాతృబహుభాషా ఉపాధ్యాయులకు జీతాలు పెంచాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి సవర డంబురు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో భాషావాలంటీర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలో పనిచేస్తున్న భాషా ఉపాధ్యాయులకు రూ.5వేల నుంచి రూ.32వేలు పెంచేంత వరకూ పోరాడాలని పిలుపునిచ్చారు. అభ్యర్థులెవరైనా డైట్, బిఇడి పూర్తి చేయకపోతే వెంటనే చేయాలన్నారు. అనంతరం సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు పోరాటాలకు కార్యాచరణ ప్రణాళికను తయారు చేసుకున్నారు. కార్యక్రమంలో సవరభాషా ఉపాధ్యాయులు సవర ఎల్లాంగు, నాందరావు, రాజు, మండంగి వెంకటేష్, సవర మాసయ్య, సరవ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫంక్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ఫంక్షన్ హాల్ ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని బైపాస్ రోడ్ ప్రధాన రహదారి పక్కన భాస్కర్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు చుక్క భాస్కరరావుచే అత్యుత్తమ హంగులతో నిర్మించిన భాస్కర్ విఐపి ఫంక్షన్ హాల్‌ను స్థానిక ఎమ్మెల్యే అజంగి జోగారావు మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి.జయప్రకాష్ నారాయణతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఉన్న పట్టణానికి పలు నియోజకవర్గాల నుంచి విఐపిలతో పాటు, ప్రజాప్రతినిధులు, అధికారులు వస్తుంటారని, సమావేశాలు నిర్వహించేందుకు ఫంక్షన్ హాలులు ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని హంగులతో ఈ విఐపి ఫంక్షన్ హాల్‌లో నిర్మించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో సీతానగరం మండల వైసిపి అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, పట్టణ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఉచితంగా స్వెట్టర్లు అందజేస్తున్న సర్పంచ్ వెంకటరత్నం

వికలాంగులపై ప్రేమ కనబర్చాలి

ప్రజాశక్తి - మక్కువ

వికలాంగులపై ప్రజలు ప్రేమ కనబర్చాలని, అంగవైకల్యం శరీర అవయవాలకు తప్ప వారి మనసులకు కాదని వెంకట బైరపురం సర్పంచ్ ఎ.వెంకటరత్నం అన్నారు. ఆదివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాలు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగాయి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెస్సార్ ఫౌండేషన్ సంస్థ అధినేత మరడ శ్రీనివాసరావు మాట్లాడుతూ వికలాంగులు అనేక రంగాల్లో ఇప్పటికే రాణిస్తున్నారన్నారు. అటువంటి వారిని ఎంతో ప్రోత్సహించాలని, అలాగే వారిలాగే ఉన్నతమైన స్థానాల్లో రాణించాలని ఆకాంక్షించారు. వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడుతుందని తెలిపారు. ఎమ్మెస్సార్ ఫౌండేషన్ సహకారంతో 15 మంది ప్రత్యేక అవసరాల పిల్లలకు స్వెటర్లు ఉచితంగా అందజేశారు. వెంకటబైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అమరాపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాత్రిపూట కుళాయి నీళ్లు పడుతున్న మహిళలు

వేళాపాళా లేని తాగునీటి సరఫరా

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని 25, 26 వార్డులకు మున్సిపల్ తాగునీటి విభాగం సిబ్బంది వేళాపాలా లేకుండా తాగునీటి సరఫరాను ఇవ్వడంతో ఆయా వార్డులకు చెందిన మహిళలు తాగునీటి విభాగం అధికారుల, సిబ్బందిపై అసహనం వ్యక్తం చేస్తూ బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అసలే మూడు, నాలుగు రోజులకొకసారి తాగునీటి సరఫరా జరుగుతుండడంతో పాటు వేళా పాలా లేకుండా సరఫరా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పనులపై బయటకు వెళ్లేవారు, విధులకు వెళ్లేవారు, తాగునీరు పట్టుకునేందుకు వీల్లేకుండా పోతుందని ఆవేదన చెందుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ తాగునీరు విభాగం అధికారులు దృష్టి సారించి ఉదయం వేళల్లో తాగు నీరు సరఫరా చేయాలని మహిళలు కోరారు.

చప్పబుచ్చంపేటలో జనసేన జెండావిష్కరణ

ప్రజాశక్తి- మక్కువ

మండలంలోని చెప్పబుచ్చంపేటలో జనసేన జెండా ఆవిష్కరణ ఆదివారం నిర్వహించారు. అనంతరం టిడిపి-జనసేన నాయకులు గ్రామ సభను ఏర్పాటు చేశారు. రానున్న ఎన్నికల్లో టిడిపి-జనసేన కలిసి పని చేస్తున్నందున అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి మాజీ అధ్యక్షులు పెంట తిరుపతి రావు, శంబర ఎంపిటిసి సభ్యులు టి పోలినాయుడు, జనసేన సమన్వయ కర్తలు గేదెల రిషివర్ధన్, మర్రాపు సురేష్, బాబు పాలురు, పాపారావు, సీనియర్ నాయకులు బుచ్చినాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంఘీభావం తెలుపుతున్న టిడిపి, జనసేన నాయకులు

సమస్యల పరిష్కారం కోసం

ఆశా, సిహెచ్‌డబ్ల్యుల 36 గంటల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

దీర్ఘకాలంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 11,12 తేదీల్లో స్థానిక కలెక్టరేట్ వద్ద 36గంటల పాటు ధర్నా చేపట్టనున్నట్టు ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు వి.ఇందిర తెలిపారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో యూనియన్ నాయకులు కె.నిర్మల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ధర్నా వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఇందిర మాట్లాడుతూ ఆశా వర్కర్లపై ఆన్లైన్లో రికార్డు, మొబైల్ వర్క్ వంటి అదనపు పనులు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. పని ఒత్తిడితో పెరగడంతో ఆశా కార్యకర్తలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం వేతనాల్లేకుండా, సంక్షేమ

ధర్నా కరపత్రాలను విడుదల చేస్తున్న ఆశా కార్యకర్తలు, నాయకులు

పథకాలు సక్రమంగా ఇవ్వకుండా, మెడికల్, మెటర్నర్ సెలవులు అమలు చేయకుండా పిహెచ్‌సికి వచ్చిన ప్రతి సందర్భంలో టిఎ, డిఎ ఇవ్వకుండా ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటుందని విమర్శించారు. కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని, మెడికల్, ప్రభుత్వ సెలవులు వర్తింపజేయాలని, రూ.10లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్చాలని, 62 ఏళ్లకు రిటైర్మెంట్ జీవోను వర్తింప చేయాలి. ఎఎన్ఎం హెల్త్ సెక్రటరీ పోస్టుల భర్తీలో ఆశాలకు వెయిటేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని కోరుతూ ఈనెల 11,12 తేదీల్లో కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ ధర్నాకు ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, కోశాధికారి జి.వెంకటరమణ, వివిధ మండలాలకు చెందిన ఆశా కార్యకర్తలు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పంచారామాలకు బస్సు సర్వీస్

ప్రజాశక్తి-పాలకొండ

కార్తీక మాసంలో ప్రతి వారం పంచారామ శైవ క్షేత్రాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినట్లు, ఈ సౌకర్యాలను ప్రజలు ఉపయోగించుకోవాలని డిపో మేనేజర్ పి. వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రతి శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు బస్సు బయలు దేరి ఆదివారం అమరావతి, భీమవరం, పాల కొల్లు, ద్రాక్షరామం, సామర్లకోట పుణ్యక్షేత్రాలకు తీసుకెళ్లనున్నట్టు తెలిపారు. ఆసక్తి కలవారు డిపో నందు కానీ, ఆర్టీసీ కాంప్లెక్స్ నందు కానీ సంప్రదించాలన్నారు.

తుపాను వల్ల ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలి

కొమరాడ: తుపాను వల్ల అటు రైతులు, ఇటు ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. ఇప్పటికే రైతులు వరి కోతలు కోసి కుప్పలు కూడా పొలాల్లో వేశారని అన్నారు. పంటలను ఇంటికి తీసుకొచ్చుకొచ్చే పరిస్థితుల్లో తుపాను ముంపు ముంచుకు రావడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులను ఆదుకొనేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలనికోరారు.

పంటలను సురక్షిత ప్రాంతాల్లో భద్రపర్చుకోవాలి

ప్రజాశక్తి - సీతానగరం

మిచాంగ్ తుపాను నేపథ్యంలో రైతులు తమ పంటలను సురక్షిత ప్రాంతాల్లో భద్రపర్చుకోవాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి కె.రాబర్ట్‌పాల్ అన్నారు. మండలంలోని సూరంపేట, జోగింపేట, చినభోగిలిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పత్తి, వరి పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి తుపాను తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. పత్తి పంట పిక్కింగ్ దశలో ఉంది కావున రైతులు ఈ తుపాను రావడానికి ముందుగానే పత్తి తడవకుండా సురక్షిత ప్రాంతంలో భద్రపర్చుకోవాలని సూచించారు. అలాగే వరి పంట కోత దశలో ఉన్నందున తుపాను ముగిసే వరకూ కోతలను వాయిదా వేసుకోవాలని తెలిపారు. కోత జరిగిన

రైతులతో వరికుప్పలు వేయిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

చేను వెంటనే కుప్పలుగా వేసుకోవాలని, తుపాను ఎక్కువగా ఉండడం వల్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, వాటిని వినియోగించుకోవాలని తెలిపారు. నూర్చిన ధాన్యం వెంటనే రైతు భరోసా కేంద్రం నుండి మిల్లులకు తరలించాలని తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి అవినాష్ పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 5న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించబోయే జాబ్ మేళాలో డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనింగ్ ప్రొడక్షన్స్, సోలారా యాక్టివ్ ఫార్మా సైన్సెస్ కంపెనీలో ప్రొడక్షన్ టెక్నీషియన్, ఇండస్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో టెక్నీషియన్ ఆపరేటర్ ఉద్యోగ అవకాశాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని కళాశాల ప్రిన్సిపల్ టి.శ్రీవరం తెలిపారు. అలాగే హెూండా మోజెస్, ఇనుజు మోటార్స్ , సియాన్ ఇ - హెచ్ డబ్ల్యు ఏ సుమిత్, శ్రీకాళహస్తి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. పై ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిప్లమో, డిగ్రీ, బిటెక్‌లో ఉత్తీర్ణులైన 35ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12వేలు నుంచి రూ. 20వేలు వరకు జీతం, ఇన్సెంటివ్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగుల బట్టి ఉంటుందని అన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు జీరాక్స్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

గిరిజన గ్రామాల్లో 'వికసిత్ భారత్'

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మండలంలోని గోచెక్క, బుదురువాడ గిరిజన గ్రామాల్లో ఆదివారం స్థానిక తహశీల్దార్ శివన్నారాయణ, ఎంపిడిఒ రమణమూర్తి ఆధ్వర్యంలో వికసిత భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ముఖ్యంగా గిరిజనులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. అనంతరం దృశ్య, శ్రవణ వాహనాలపై పథకాలకు వివరాలను సవివరంగా వివరించారు.

గుమ్మలక్ష్మీపురం : సభలో మాట్లాడుతున్న జగదీశ్వరి

పనసభద్రలో భవిష్యత్తుకు గ్యారంటీ

ప్రజాశక్తి -మక్కువ

రాబోయే ఎన్నికల్లో టిడిపి రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని సాలూరు నియోజకవర్గ ఇన్చార్జ్ గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని పనసభద్ర పంచాయతీ చెక్కవలస, చిమిడివలస, ఎర్రసామంతవలసలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె గ్రామాల్లోని గిరిజన మహిళలతో మాట మంతి కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు గుళ్ల వేణుగోపాల్ నాయుడు, బొంగు వాసుదేవరావు, గొంగాడ భూషణ్, సిహెచ్ తవిటినాయుడు, బుడుసెట్టి గౌరి, మింది సింహాచలం, పెంట సత్యం, దాకేటి గౌరినాయుడు, వేగుళ్ళ వీరభోగం, సామయ్య పాల్గొన్నారు.

గుమ్మ లక్ష్మీపురం : మండలంలోని బీరుపాడు పంచాయతీ ఇజ్జక్కాయిలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తేనే గిరిజన బతుకులు బాగుంటాయన్నారు. కార్యక్రమానికి ముందు జగదీశ్వరికి గిరిజనులు అపూర్వ స్వాగతం పలికారు. నిజమైన గిరిజన వ్యక్తిని రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కోరారు.

రాష్ట్ర కమిషన్ దృష్టికి సమస్యలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ దృష్టికి ఎస్సీ, ఎస్టీల సమస్యలు తీసుకువెళ్లినట్లు జనసేన పార్వతీపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎ.మోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం విశాఖపట్నంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్‌ను కలిసి ఎస్సీ, ఎస్టీల సమస్యలను చర్చించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ నియోజక వర్గాల సమస్యలు, జిల్లా సమస్యలు, అధికారులు తీరుపై చర్చించి ఎస్సీ ఎస్టీ చట్టాన్ని, వారి హక్కులను కాల రాస్తున్న అధికారులు భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో విజయనగరం ఉమ్మడి జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు డోలా రాజేంద్రప్రసాద్, జనసేన సీనియర్ నాయకులు దంతులూరి రామచంద్ర రాజు, ఎస్సీ ఎస్టీ టీచర్స్ యూనియన్ లీడర్ కల్లేపల్లి ఈశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ సంతోషి

గురుకుల పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను దిశా ఎస్ఐ డి.సంతోషి కుమారి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలకు దిశ యాప్, పోస్కో, సైబర్ క్రైమ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎలాంటి మోసాలకు లొంగకూడదని, ప్రస్తుతం యువత మొబైల్ ఫోన్‌తో మమేకంలో ఉన్నారని, తెలియని వారి వలలో పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఎవరికైనా ఎలాంటి ఆపద వచ్చినా తప్పక ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేయవచ్చని అన్నారు. అలాగే హాస్టల్‌లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పండగ టైంలో ఇంటికి వెళ్లి పుస్తకాలతో కాలం గడపాలని, సమయం వృథా చేయరాదని అన్నారు. కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్కుకు పోటెత్తిన పర్యాటకులు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ ఆదివారం పర్యాటకులతో పోటెత్తింది. కార్తీక మాసం అందులో ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు పెద్దఎత్తున తరలివచ్చారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి వచ్చారు. కనులు మైమరిపించే అందాలను కనువిందు చేసేందుకు కాసేపు సేద తీర్చుకోవడానికి పర్యాటక ప్రాంతాలను పర్యాటక ప్రేమికులు సందర్శించి కాసేపు ప్రకృతి ఒడిలో సేదతీర్చుకున్నారు. ఒకపక్క పచ్చని పొలాలు, మరోపక్క ఒంపు సొంపులతో కొండలు, మరోవైపు పక్కనే ఉన్న జలజలలాడే జలపాతాలు చూస్తుంటే మనల్ని మనమే మర్చిపోయిన అనుభూతి కలుగుతుంది.ఇక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ లో బోటు షికారు, స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెరలు కొడుతున్నారు. చిన్నారులు మినీ ట్రైన్ ఎక్కి ఆడుకుంటున్నారు. ఫైవ్ డి థియేటర్లో భయభ్రాంతలకు గురయ్యే హర్రర్ పిక్చర్లు చూస్తుంటే మన పైనే పడేలా అనుభూతి కనిపిస్తుంది. మరోపక్క ఆనంద విహార వద్ద యువతీ యువకులు ఉల్లాసంగా, ఉత్సాహంగా డాన్సులు

వాటర్ సైక్లింగ్ చేస్తున్న యువత

వేస్తూ గడుపుతున్నారు మెట్టు గూడ జలపాతం వద్ద పర్యాటకులు జలకాలాడుతున్నారు.



రాజన్నదొరకు వినతిని అందజేస్తున్న ఎస్‌టి ఉపాధ్యాయులు

ఎస్‌టి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

డిప్యూటీ సిఎంకు వినతి

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలోని గిరిజన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ఎపి గిరిజన ఉపాధ్యాయుల సంఘం నాయకులు డిప్యూటీ సిఎం రాజన్నదొరను కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్.సూర్యనారాయణ, కార్యదర్శి జి.శేషగిరిరావు, జిల్లా అధ్యక్షులు మువ్వల లచ్చయ్య ఆధ్వర్యాన సంఘం నాయకులు రాజన్నదొరను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. డిఇఒ, డిప్యూటీ డిఇఒ పోస్టుల భర్తీలో గిరిజన ప్రధానోపాధ్యాయులకు అవకాశం కల్పించాలని కోరారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలన్నారు. భాషా పండితులు, పిఇటిలకు అప్ గ్రేడ్ చేయాలని కోరారు. సీనియర్ ఉపాధ్యాయులకు నోషనల్ సీనియారిటీ కల్పించాలని కోరారు. దీనిపై రాజన్నదొర స్పందిస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సూర్యపీఠంలో ప్రత్యేక హోమాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ శివారులో ఉన్న సూర్య పీఠంలో ఆదివారం పీఠం నిర్వాహకులు వేమకోటి నరహరి శాస్త్రి ఆధ్వర్యంలో ఆదిత్యనికి సూర్య నమస్కారాలు, ప్రత్యేక సౌర హెూమం, సుదర్శన హెూమం, ఆదిత్య పంచాయతన క్షీరాభిషేకం, మిత్ర రవి సూర్య, భాను, ఖగ పూష, హిరణ్యగర్భ, మరీచి, ఆదిత్య, సావిత అర్క, భాస్కర దేవతలకు పూజలు నవ నాగ అర్చన నవగ్రహ హెూమాలు, విశ్వశాంతి మంత్ర హెూమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో వేమకోటి వివేకానంద టి.ర్. రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- గంట్యాడ

గంట్యాడకు చెందిన బెవరిచెట్టి గణపతి (25)ను గుర్తు తెలియని వాహనం ఆదివారం తెల్లవారు జామున ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. గణపతి తెల్లవారు జామున కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో కాళ్ళు, తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడని ఎస్ఐ కె. కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు. మృతుని సోదరుడు పైడిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

వెలుగులో జలగ!

తూతూ మంత్రంగా స్థానం మార్పు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కలిగిన ఏ ఉద్యోగికైనా బదిలీలు తప్పనిసరి. అయితే ఆ ఉద్యోగికి ఈ నిబంధనలేవీ వర్తించవు. వడ్డించేవాడు మనవాడైతే కడబంతిలో కూర్చొన్నా కొరత లేదన్న చందాన ఉంది అతని పరిస్థితి. రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండడంతో మండలంలోని వైకెపి (వెలుగు) కార్యాలయంలో ఓ ఉద్యోగి ఒకే చోటు పదేళ్లకు పైగా ఒకేచోట ఉంటూ జలగలా అంటుకుపోయారన్న చర్చ సర్వత్రా జరుగుతోంది. దీర్ఘకాలంలో ఒకేచోట విధులు నిర్వహిస్తూ తన హవా కొనసాగిస్తున్నాడు ఆ ఉద్యోగి.

మండలంలోని వైకెపి కార్యాలయంలో సిసిగా ఉద్యోగి దీర్ఘకాలంగా పనిచేస్తున్నారు. ఈ బదిలీ విషయంలో నిబంధనలు చెల్లవనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఈ శాఖకు చెందిన ఎపిఎంలు, సిసి, ఇతర సిబ్బందికి బదిలీలు జరిగాయి. అయితే ఈ ఉద్యోగి బదిలీ విషయంలో ఉన్నతాధికారులు, పాలకుల అండదండలు ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా ఆ ఉద్యోగికి స్థానచలనం మాత్రం జరగడంలేదన్న చర్చ జరుగుతోంది. మారని ఉద్యోగి అని పలువురు ప్రజలు ముచ్చటించుకుంటున్నారు. అలాగే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆయన చేతివాటం ఎక్కువగా ఉంటున్నందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తూతూ మంత్రంగా బదిలీ

తుతూ మాత్రంగా స్థానం చలనం చీపురుపల్లికి జరిగింది. ముచ్చటగా మూడు నెలలు అక్కడ పనిచేసి మళ్లీ యధాస్థానానికి రావడం పై

వెలుగు కార్యాలయం

రాజకీయ పలుకుబడి ఏ స్థాయిలో ఉందో అనడానికి ఎలాంటి సందేహం లేదని మండలంలో పలువురు మహిళా సంఘ సభ్యులు చర్చించుకుంటున్నారు.

చక్రం తిప్పుతున్న సిసి

స్థానిక వెలుగు కార్యాలయంలో ఏ మహిళా సంఘానికి రుణం కావాలంటే ఎపిఎం అనుమతి కావాలంటే ఈ సిసిని ఆశ్రయించాల్సిందే. విఎఒలతో కుమ్మక్కై దొరికిన దగ్గర దోచుకోవడమే ఇతని పని అని పలువురు మహిళా సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు ఈయన విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అబ్దుల్ కలాం ఎక్స్‌లెన్స్ అవార్డుకు రాజు

బొబ్బిలి: ఎపిజె అబ్దుల్ కలాం ఎక్సలెన్స్ అవార్డుకు కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, రోటరీ క్లబ్ కార్యదర్శి జెసి రాజును సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ, డాక్టర్ బ్రహ్మ దేశం సామాజిక సంస్థ ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ గాంధీనగర్ హనుమంతు గ్రంథాలయంలో ఆదివారం అవార్డును ప్రదానం చేశారు. తాను చేసిన సామాజిక కార్యక్రమాలకు అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని రాజు అన్నారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపడతామన్నారు. రాజును పట్టణ ప్రముఖులు అభినందించారు.

37 కిలోల గంజాయి స్వాధీనం

విజయనగరం : 37 కిలోల గంజాయిని ఎస్ఇబి సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన నగరంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ బి.మధుకుమార్ సిబ్బందితో కలిసి నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో పెట్రోల్ చేపడుతున్నారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు నాలుగు బ్యాగుల్లో గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నారు.